క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా వెంకటరమణ



తెర్లాం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మండలంలోని గంగన్నపాడుకు చెందిన డాక్టర్ జి.వెంకటరమణను నియమించారు. ఇదే విషయాన్ని ఆయన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి, తనకు ఈ పదవి కట్టబెట్టిన పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలన్నారు. ఆయన నియామకం పట్ల పార్టీ మండల శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సక్రమంగా సర్వేలు చేయండి

రాజాం సిటీ: సర్వేలు సక్రమంగా చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌లతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన.. స్వర్ణ పంచాయతీలో హౌస్ ట్యాక్స్ డేటా ఎంట్రీ, ఈ సర్వేసులు, లైబ్రరీ సెస్, డైలీ గార్బేజ్ కలెక్షన్, పీఆర్ వన్ యాప్, ఆర్‌టీఐ యాక్ట్ పెండింగ్‌లు, పీఎం విశ్వకర్మ స్టేజ్-1 పెండింగ్‌లు, పెండింగ్ సర్వేలు వంటి వాటిని అడిగి తెలుసుకున్నారు.

విరాళాల సేకరణ

బొబ్బిలి: పోలియో నిర్మూలన చర్యల కోసం స్థానిక పట్టణంలోని పలు కూడళ్లలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ శనివారం చేపట్టారు. వారం రోజులుగా సేకరిస్తున్న ఈ నిధులతో రోటరీ క్లబ్ ద్వారా చేపట్టే సేవా కార్యక్రమాలకు వినియోగిస్తామని క్లబ్ అధ్యక్షుడు రాజు మాస్టారు తెలిపారు.

జీవామృతం తయారీపై అవగాహన

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో జీవామృతం తయారీపై శనివారం అవగాహన కల్పించారు. ఏవో మురళీకృష్ణ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు ఇచ్చే ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు చేయాలని కోరారు. అనంతరం ఆవుపేడ, వేపాకులు, గోమూత్రం వంటి వాటితో జీవామృతం తయారీని వివరించి, దాని ప్రయోజనాలు తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కార్యాచరణ

వంగర: మహిళల ఆర్థికాభివృద్ధికి కార్యాచరణ రూపొందించాలని ఏపీఎం టి.మంగమ్మ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంఎంఎస్ సమావేశం శనివారం నిర్వహించారు. వివిధ రకాల వృత్తులు చేస్తున్న లబ్ధిదారుల వివరాలు నమోదు చేసి, వారికి అవసరమైన రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు బి.రామలక్ష్మి, సీసీలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా గ్రావెల్ రోడ్డు నిర్మాణం



గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు

సంతకవిటి: మండలంలోని సోమన్నపేట, శ్రీహరినాయుడుపేట గ్రామాల మధ్య గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. మండల పరిషత్ నిధులతో వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ గండ్రేటి కేసరి ఆధ్వర్యంలో ఈ నిర్మాణం జరుగుతోంది. రోడ్డు పూర్తయితే మద్దూరుపేట, శంఖరపేట, గొల్లవలస, శ్రీహరినాయుడుపేట ప్రజలు రాజాం చేరుకోవడానికి దూరం తగ్గుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వాహన తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

వంగర: మండల కేంద్రం సహా మగ్గూరు జంక్షన్ వద్ద పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వారి డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువపత్రాలను పరిశీలించి, ఆయా పత్రాలు లేని వారికి అపరాధ రుసుం విధించారు. వాహనదారులంతా ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎస్‌ఐ షేక్‌శంకర్ సూచించారు.

28 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో జె.త్రినాధరావు కోరారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో శిబిరాల బ్రోచర్‌ను ఎంఈవో శనివారం ఆవిష్కరించారు. ఏటా పాఠశాలలకు ఇచ్చే వేసవి సెలవుల్లో ఈ శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతోందని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి తెలిపారు.

ఏ పార్టీలో గెలిచిన వారు..

ఆ పార్టీలో ఉంటేనే గౌరవం

- అధికార పార్టీ ప్రలోభాలకు లొంగవద్దు
- పార్టీలోకి తిరిగొచ్చేయండి
- వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లకు మాజీ ఎమ్మెల్యే శంబంగి పిలుపు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి సిద్ధమవుతున్న టీడీపీ కౌన్సిలర్ల వెంట వెళ్లిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు తిరిగి పార్టీలోకి వచ్చేయాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. ఇదే విషయమై ఆయన స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏ పార్టీలో గెలిచిన వారు ఆ పార్టీలో ఉంటేనే ప్రజల్లో గౌరవం ఉంటుందన్నారు. అధికార పార్టీ నాయకుల ప్రలోభాలకు లొంగి వెళ్లి ఉంటారని భావిస్తున్నామని, మీరంతా అనుకుంటున్నట్లు చైర్మన్‌పై ఉద్దేశపూర్వకంగా కూటమి పెడుతున్న అవిశ్వాస తీర్మానం గెలవదని, వీగిపోద్దన్నారు. అవిశ్వాస తీర్మానికి ఇచ్చిన నోటీసులో తప్పనిసరిగా ఉండాల్సిన కౌన్సిలర్ల సంతకాలు లేవని, కుళ్లు రాజకీయాల కోసం ఆదరబాదరాగా చేసే ప్రయత్నాలు చేదు ఫలితాలిస్తాయన్న విషయం తెలుసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవిశ్వాస తీర్మానం గెలవదని పునరుద్ఘాటించారు. దీనిపై హైకోర్టులో రిట్ పిటిషన్ కూడా దాఖలు చేశామన్నారు. మరో రెండు రోజుల్లో దానిపై తీర్పు వస్తుందన్నారు. చైర్మన్ సీటు మార్చేందుకు టీడీపీ కౌన్సిలర్లకు సహకరిస్తున్న తమ పార్టీ కౌన్సిలర్లకు పార్టీ తరఫున విప్ జారీ చేస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టే సంస్కృతి గతంలో ఎన్నడూ లేదన్నారు.

ఇటువంటి చెత్త సంస్కృతి బొబ్బిలి రాజులు రాజకీయాల్లోకి వచ్చిన తర్వాతే వచ్చిందని మండిపడ్డారు. మంత్రి పదవి కోసం పార్టీ మారే వారూ అందులోనే ఉన్నారని ధ్వజమెత్తారు. మంచి రాజకీయాలు చేస్తూ అందరం మంచిగా ఉందామన్నారు. అవిశ్వాస తీర్మానానికి సమర్పించిన నోటీసు ఉపసంహరించుకోవాలని కోరారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌చార్జ్ శంబంగి వేణుగోపాలనాయుడు, పార్టీ అధికార ప్రతినిధి తూముల రామసుధీర్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోదరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రాజాం: స్థానిక సన్‌రైజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని డీఆర్ఎస్‌వలస గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గులిపిల్లి కృష్ణంనాయుడు భార్య సరస్వతమ్మను పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ శనివారం పరామర్శించారు. ఆరోగ్యంపై ఆరాతీసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట రాజాం ఎంపీపీ లావేటి సులోచన, పార్టీ రాజాం మండల కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, సర్పంచ్ కరణం తులసినాయుడు, ఎంపీటీసీ సభ్యులు వాసు, కృష్ణంనాయుడు తదితరులు ఉన్నారు.

బాడంగి: మండలంలోని వాడాడ గ్రామదేవత పైడితల్లి పూజారి గొట్టాపు తమ్మినాయుడు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆ గ్రామానికి శనివారం వెళ్లి, పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి, ధైర్యం చెప్పారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ పూడి కృష్ణమూర్తి, పార్టీ నాయకులు రామారావు, సీతంనాయుడు, సత్యం తదితరులు ఉన్నారు.



బాడంగి: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాం సిటీ: స్థానిక పట్టణంలోని శ్రీకాకుళం, పాలకొండ రోడ్లలోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో ఆదివారం అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏడీ ఫణీంద్రకుమార్ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో బ్రేకర్ వర్క్‌తో పాటు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ అసౌకర్యం కలుగుతుందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం

బాడంగి: మండల కేంద్రంలో నావల్ ఆయుధ డిపో ఏర్పాటుకు సంబంధించి, భూములు కోల్పోతున్న రైతులకు అన్ని విధాలా న్యాయం జరిగేలా చూస్తామని బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని శనివారం సందర్శించిన ఆయన.. విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం భూముల సేకరణకు సంబంధించి చర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయన్నారు. పూర్తి స్థాయిలో నిధులు కేటాయించిన తర్వాతనే భూముల కేటాయింపులో ముందుకు వెళ్లగలమని నావల్ అధికారులకు చెప్పామన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ఆయన వెంట తహసీల్దారు సుధాకర్ ఉన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

రేగిడి: ప్రతిఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని, అప్పుడే ఒకరికొకరు సహాయం చేసుకోగలమని ఆధ్యాత్మిక వక్త సాయిమురళీ మాస్టారు అన్నారు. శనివారం స్థానిక విశ్వసాయి మందిరం వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక ప్రసంగమిచ్చిన ఆయన.. ధర్మ స్థాపన, సంరక్షణే లక్ష్యంగా అందరూ అడుగు వేయాలన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ముందుకురావాలన్నారు. అనంతరం సాయిమురళీ మాస్టారును సత్కరించారు. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సింహాద్రిఅప్పన్న సంబరాలు

వంగర: మండలంలోని కోనంగిపాడు గ్రామంలో సింహాద్రిఅప్పన్న సంబరాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పందిరిపాట, తప్పెటగుళ్లు వంటి సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

యుద్ధప్రాతిపదికన తాగు నీటి బోర్లు మరమ్మతులు

వంగర: మండలంలోని కోనంగిపాడు గ్రామంలో పాడైన తాగునీటి బోర్లు మరమ్మతులు శనివారం యుద్ధప్రాతిపదికన చేపట్టారు. సర్పంచ్ చందక తాతబాబు ఆధ్వర్యంలో మెకానిక్ కళింగ కృపారావు బోర్లు బాగు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



సంతకవిటి: ర్యాలీలో వెలిగించిన కొవ్వొత్తులతో యువత



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు శ్రీనివాసరావు



బొబ్బిలి: కొవ్వొత్తుల ర్యాలీలో చిన్నారులు

సంతకవిటి: జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ మండలంలోని మామిడిపల్లి గ్రామంలోని యువత శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల చర్యను ఖండిస్తూ మృతులకు నివాళులర్పించారు.

రామభద్రపురం: జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ముష్కరులు చేసిన దాడి అమానుషమని సీఐటీయూ జిల్లా నాయకుడు బలస శ్రీనివాసరావు ఖండించారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో ప్రధాని మోదీ అనుసరిస్తున్న విధానాల వల్లే పాకిస్థాన్ ఉగ్రవాదులు పేట్రేగిపోతున్నారని విమర్శించారు. కశ్మీర్‌లో ఏటా ఉగ్రమూకలు దాడికి పాల్పడడం, వాటిల్లో అమాయకులు, సైనికులు బలిగొనడం సాధారణమైపోయిందన్నారు. ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి అని అన్నారు.

బొబ్బిలి: కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడికి వ్యతిరేకంగా స్థానిక పట్టణంలోని యాదవ వీధిలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ప్రపంచ శాంతికి, ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పేందుకు ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని కోరారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఈసీ శ్రీనివాసరావు

రాజాం: మండలంలోని కంచరాం గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను ఈసీ శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. వేతనదారుల మస్తర్లు పరిశీలించి, పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలని సూచించారు. జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పించాలన్నారు. వేసవి నేపథ్యంలో రెండు పూటలా చల్లని సమయాల్లోనే పనులు చేసుకోవాలని, పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

రెవెన్యూ సిబ్బందిని అడ్డుకున్న గిరిజనులు

మెంటాడ: అదానీ పవర్ ప్లాంట్ కోసం మారిక గ్రామంలో భూసేకరణకు జిల్లా కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. ఆ నోటీసులను గ్రామంలో అతికించేందుకు ఉప తహసీల్దార్ సన్యాసినాయుడు, ఆర్‌ఐ రామలక్ష్మి, ఇతర రెవెన్యూ సిబ్బంది శనివారం ఆ గ్రామానికి వెళ్లగా...

స్థానిక గిరిజనులు, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు జగన్ అడ్డుకున్నారు. అదానీ పవర్ ప్లాంట్‌కు భూములు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ గిరిజనులు ఆందోళన చేశారు. ఈసందర్భంగా జగన్ మాట్లాడుతూ అధికారులు ప్రజల పక్షాన కాకుండా అదానీ సేవలో మునిగిపోవడం అన్యాయమన్నారు. ఏకంగా గ్రామాన్ని అదానీకి రాసిచ్చేస్తాం అంటే గిరిజనుల బతుకులు ఏం కావాలని ప్రశ్నించారు.ప్రాణాలు పోయినా సరే గ్రామాన్ని, భూములను వదులుకునే ప్రసక్తే లేదని అన్నారు.రిక్విజేషన్ డిపార్ట్‌మెంట్ వారి సమాచారం మేరకు మారిక రెవెన్యూలో సర్వేనంబర్ 1 నుంచి 32 వరకు సుమారు 213.80 ఎకరాల భూమిని గిరిజనులు కోల్పోతున్నారన్నారు. మారిక గ్రామాన్ని, భూములను వదులుకునేందుకు సిద్ధంగా లేమని, ఎవరు వచ్చినా అడ్డుకుంటామని తేల్చి చెప్పేశారు. దీంతో రెవెన్యూ అధికారులు వెనుదిరిగారు.

15శాతం వృద్ధిరేటు సాధించేలా ప్రణాళికలు



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

శృంగవరపుకోట: జిల్లాలో 15శాతం వృద్ధిరేటు సాధించేందుకు అనుగుణంగా గ్రామస్థాయిలో ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అధికారులకు సూచించారు. స్థానిక శిరికి రిసార్ట్స్‌లో నియోజకవర్గ అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినూత్నంగా, విభిన్నంగా ఆలోచన చేసి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని, వాటిని పటిష్టంగా అమలు చేసి ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. జిల్లాలో ప్రాథమిక రంగంలోనే ఎక్కువ అభివృద్ధి సాధించే అవకాశం ఉందని, వ్యవసాయ యోగ్యమైన భూమి జిల్లాలో 3 లక్షల ఎకరాల వరకూ ఉందని, ప్రస్తుతం 1.80 లక్షల ఎకరాలే సాగవుతోందన్నారు. మిగులు భూమిని దశల వారీగా సాగులోకి తెచ్చి వివిధ రకాల పంటలు, అంతర పంటలు, ఉద్యానవన, వాణిజ్య పంటల సాగును ప్రోత్సహించి, ఉత్పాదకత పెంచాలన్నారు. పాలు, మాంస ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి పెంచాలన్నారు. ప్రతి మండలంలో ఒక పౌల్ట్రీ, డెయిరీ ఏర్పాటయ్యేలా చూడాలని, జిల్లాకు రోజుకు 10లక్షల లీటర్ల పాలు అవసరం కాగా ప్రస్తుతం రోజుకు 6 లక్షల లీటర్లు వస్తున్నాయని, ఈ లోటును భర్తీ చేయాలని కోరారు. చెరువుల్లో చేపల పెంపకాన్ని యుద్ధప్రాతిపదికన పెంచాలని, పారిశ్రామిక అభివృద్ధి కోసం ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామస్థాయి భౌగోళిక పరిస్థితులు, వనరులు, వసతులు అన్నీ అధ్యయనం చేసి, గ్రామస్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.సీపీఓ పి.బాలాజీ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ -2047 ప్లానింగ్‌లోని పది సూత్రాలను, మండలాల వారీగా జీడీపీ, జీవీఏ లక్ష్యాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో వివరించారు.అనంతరం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను కలెక్టర్ తిలకించి, రైతులకు నవధాన్యాల కిట్లు అందజేశారు. వ్యవసాయశాఖ జేడీ వి.టి.రామారావు, పశుసంవర్థకశాఖ జేడీ వై.వి.రమణ, ఉద్యానవనశాఖ డీడీ ఏ.వి.ఎస్.వి.జమదగ్ని, ఏపీఎంఐపీపీడీ పి.ఎస్.వి.లక్ష్మీనారాయణ, ప్రకృతి వ్యవసాయ డీపీఎం ఆనందరావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి మురళి, విజయనగరం ఆర్డీఓ కీర్తి, నియోజకవర్గంలోని అయిదు మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, అనుబంధశాఖల అధికారులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పే స్కేల్ అమలు చేయండి



వీఆర్ఏ(విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్)లకు పే స్కేల్ అమలు చేయాలని ఏపీ వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు యజ్జల అప్పలస్వామి డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన వంగర మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. వీఆర్ఏలకు పనిభారం తగ్గించాలని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని, నామినీలకు వీఆర్ఏ అర్హత కల్పిస్తూ జీవో జారీ చేయాలని కోరారు. ఇవే డిమాండ్ల సాధన కోసం ఈ నెల 30వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నామని, వీఆర్ఏలంతా హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

-వంగర

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



కార్మికులను కట్టుబానిసలుగా మార్చే కేంద్రం చేసిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు మెరిగాని గోపాలం డిమాండ్ చేశారు. బొబ్బిలి మండల కేంద్రంలో మేడే పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. కార్మికుల సంక్షేమం, ఆర్థిక భద్రత కోసం చట్టాలు చేయాల్సిన ప్రభుత్వమే వారి హక్కులు హరించేలా నిర్ణయాలు తీసుకుంటుండడం విచారకరమన్నారు. తక్షణమే కార్మికులను ఇబ్బందులకు గురిచేసే విధానాలను వీడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎ.రామ్మూర్తి, పి.లక్ష్మణరావు, బి.సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

-బొబ్బిలి

ఏకోపాధ్యాయ పాఠశాలల్లో మరో టీచర్‌ను నియమించాలి



ఉపాధ్యాయులకు సంబంధించి, అంతర్‌జిల్లా బదిలీలు చేపట్టాలని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడు, కార్యదర్శి కరాసు సింహాచలం డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు బొబ్బిలి మండల కేంద్రంలో శనివారం జరిగిన ఆ శాఖ జోనల్ సమావేశంలో మాట్లాడారు. బదిలీల ప్రక్రియలో కొన్ని ఖాళీలను బ్లాక్ చేయకుండా అన్ని ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఎంటీఎస్ టీచర్లకు స్పౌజ్ కేటగిరీ కింద పరిగణించి బదిలీలకు అస్కారమివ్వాలన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా రెండో టీచర్‌ను నియమించాలన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 35 మంది విద్యార్థులు దాటి ఉన్నచోట రెండో సెక్షన్ ప్రారంభించాలన్నారు. అన్ని పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాలు సమాంతరంగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో హరికృష్ణ, ఎల్లయ్య, రామకృష్ణ, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

-బొబ్బిలి

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఉపేంద్రరావు

వంగర: గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సారా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాజాం రూరల్ సీఐ హెచ్ ఉపేంద్రరావు సూచించారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని మగ్గూరులో శనివారం రాత్రి బస చేసిన ఆయన.. గ్రామస్తులకు మత్తు పదార్థాలు తీసుకోవడం కలిగే దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు-వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ షేక్‌శంకర్, ఏఎస్‌ఐ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వైద్య తనిఖీలు చేస్తున్న వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి: ప్రజలకు అందుబాటులో ఉండే ఆయుర్వేద వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ కోరారు. మండలంలోని అంబకండి గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 124 మందికి వైద్య తనిఖీల అనంతరం చ్యవన్ ప్రాస్ లేహ్యాన్ని, తైలాన్ని అందించారు. అనంతరం ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.గోవిందనాయుడు, ఎంపీటీసీ పి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.